# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక పోలీస్ అధికారులను నియమిస్తూ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఈ రోజు ఉత్తర్వులు జారీ చేశారు.

- లోక్ సభ సార్వత్రిక ఎన్నికల ఆరవ దశ పోలింగ్ ప్రక్రియ ఈరోజు కొనసాగుతోంది.

- ఆంధ్రా విశ్వవిద్యాయం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ లను విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఈరోజు పరిశీలించారు.

- తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక పోలీస్ అధికారులను నియమిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీశ్ కుమార్ గుప్తా ఈ రోజు ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 56 మంది అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను నియమించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని ఏపీ డీజీపీ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్ సభ సార్వత్రిక ఎన్నికల ఆరవ దశ పోలింగ్ ప్రక్రియ ఈరోజు కొనసాగుతోంది. 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాలకు ఓటింగ్ జరుగుతోంది. ఈ సాయంత్రం 5 గంటల వరకు సుమారు 57.70 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. దేశ రాజధాని దిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు, కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ లను విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఈరోజు పరిశీలించారు. పోలీసు సంయుక్త కమిషనర్ ఫకీరప్ప, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్ లతో కలిసి పార్లమెంటు, అంసెబ్లీలకు సంబందించిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన తనిఖీ చేశారు. భద్రతాపరమైన చర్యలను సమీక్షించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణను అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ, పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గంటకు 17 కిలో మీటర్ల వేగంతో ఉత్తరదిశగా కదులుతున్నట్టు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఇది పశ్చిమ బెంగాల్‌కు ఆగ్నేయంగా 480 కిలో మీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని స్పష్టం చేసింది. ఈరోజు రాత్రికి ఇది తుపానుగా మారి రేపు అర్ధరాత్రికి సాగర్ ద్వీపం - ఖేపుపారా వద్ద తీరం దాటుతుందని పేర్కొంది. రాగల రెండు రోజుల పాటు రాష్ట్రంలో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని వాతావరణ కేంద్ర అధికారి పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.కె. వీధి మండలం, గాలికొండ పంచాయితీ, సీలేరు పోలీస్ స్టేషన్ పరిదిలో పనసలబంద గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సామాగ్రిని నిన్న గుర్తించినట్లు జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ డంప్ లో మందుపాత్రలు, పేలుడు పదార్థాలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మావోయిస్టు పార్టీ భావజాలంతో కూడిన విప్లవ సాహిత్యం ఉన్నాయని ఆయన వివరించారు. జిల్లా పరిధిలో మావోయిస్టులు దాచిన డంప్ లన్నింటినీ త్వరలో స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం నెట్వర్క్ అసుపత్రులకు బకాయిలు విడుదల చేసిందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మల్లాది విష్ణు అన్నారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి రెండు నెలల్లో నెట్ వర్క్ ఆస్పత్రులకు 366 కోట్ల రూపాయల చెల్లింపులు చేయగా, తాజాగా మరో 200 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపద్యంలో అల్లర్లు చెలరేగే సందర్భంలో వాటిని సమర్థవంతంగా అరికట్టేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి శాంతి భద్రతల అదనపు, ఎస్పి కులశేఖర్ అన్నారు. ఈ రోజు పట్టణంలో మాక్ డ్రిల్ నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ... ఘర్షణాత్మక పరిస్థితులు తలెత్తితే, వాటిని అణచివేసి శాంతి భద్రతలను కాపాడే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్య ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలు చోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వాయుగుండ ప్రభావ నేపథ్యంలో సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, అలాగే పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. విజయవాడలో ఈ రోజు ఉదయం నుండి కుండపోత వర్షం కురుస్తుండడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో యాత్రికులకు బస సదుపాయాన్ని కల్పించింది. ఈ యాత్రకు వెళ్లే వారి కోసం ఈరోజు నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు హజ్ కమిటీ ప్రతినిధులు అబ్దుల్ ఖాదరు తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం 1800 - 425 7873 టోల్ ఫ్రీ నెంబర్ ను గానీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ వెబ్ సైట్‌ను గానీ సందర్శించాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగే పార్వతీపురం మన్యం జిల్లా ఉల్లిభద్రలోని ఉద్యాన కళాశాల పరిసరాలను భద్రతా కారణాలతో “నో ఫ్లైయింగ్ జోన్” గా ప్రకటించామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. మానవ రహిత వైమానిక వాహనాలు, డ్రోన్లు, బెలూన్, విమానయాన పరికరాలను ఎగురవేయడంపై నిషేధం విధించడం జరిగిందని వెల్లడించారు. తదుపరి ఆదేశాల వరకు "నో ఫ్లైయింగ్ జోన్" నిషేధాజ్ఞలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు జరిగే స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లకు, హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారి సమాచారం ఉంటే, వారిని ముందస్తు అరెస్టు చేయడం జరుగుతుందని శ్రీకాకుళం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి ఆర్ రాధిక పేర్కొన్నారు. ఈ రోజు పట్టణంలో డే అండ్ నైట్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో విడిగా పెట్రోల్ విక్రయాలను నిషేధించామని, పేలుడు పదార్థాలు, బాణా సంచా విక్రయాలకు అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని ఎస్పీ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తక్కువ దిగుబడి పొందుతున్న రైతులకు మేలైన వరి వంగడాలను అందించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత వ్యవసాయ అధికారులను ఆదేశించారు. భీమవరంలో ఈ రోజు ఖరీఫ్-2024 సన్నద్ధతపై నిర్వహించిన వర్క్ షాపులో కలెక్టర్ మాట్లాడుతూ.... తక్కువ దిగుబడి వస్తున్న పంట పొలాలలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా లాభసాటి పంట సాగుపై అవగాహనా తరగతులను నిర్వహించి శిక్షణ ఇవ్వాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుంటూరు నగరంలోని ప్రాంతీయ గ్రంధాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్ధులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. చిత్రలేఖనం, క్రీడలు, సంగీతం వంటి అంశాలలో నిపుణులు అందిస్తున్న శిక్షణ కార్యక్రమంలో విద్యార్ధులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో ఆంగ్ల బాషా నైపుణ్యాలపై కూడా శిక్షణ ఇవ్వడంపై విద్యార్ధులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =